

మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌కు రాఖీ కట్టిన మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పన యాదవ్ (ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి)





ముషీరాబాద్‌లో తన సోదరుడు శివన్నారాయణకు రాఖీ కడుతున్న ప్రముఖ సంఘ సేవకురాలు శివలింగమ్మ (ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి)





నాగమయ్యకుంట బస్తీ పక్కన ప్రవహిస్తున్న నాలా

వర్షం పడితే భయం గుప్పిట్లో
నాలాల పరీవాహక ప్రజలు

రాంనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వర్షం పడితే ముషీరాబాద్ నియోజకవర్గంలోని నాలాల పరీవాహక ప్రాంతాల ప్రజలు భయం గుప్పిట్లో జీవించే పరిస్థితి. భారీ వర్షాలు పడినప్పుడు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు ఉధృతి పెరిగి నాలా పరీవాహక ప్రాంతాల్లో ఉండే బస్తీల లోని ఇళ్లకి చేరడంతో ఆస్తి నష్టం జరుగుతుంది. ఒక్కోసారి ప్రాణనష్టం కూడా సంభవించే పరిస్థితి ఉంటుంది. నియోజకవర్గంలో ప్రవహించే వరదనీటి నాలాల ఇరువైపులా ప్రహరీలను పటిష్టంగా నిర్మించాలని, నాలాలను విస్తరించాలని, కొన్ని చోట్ల నాలా రంధ్రాలను పెద్దవిగా చేయాలని ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గంలోని అంబర్‌నగర్ నుంచి రాంనగర్, నాగమయ్యకుంట, పద్మాకాలనీ నుంచి అంబర్‌పేట మీదుగా హుస్సేన్‌సాగర్‌కు వెళ్లే వరదనీటి కాలువ వల్ల తరచూ పద్మాకాలనీలోని ఇళ్లలోకి వరద చేరుతుంది. ఇళ్లల్లోకి వరదనీరు రాకుండా నాలాను విస్తరించాలని లేదా ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. హుస్సేన్‌సాగర్ వరదనీటి కాలువ ప్రవహించే కవాడిగూడ, సబర్మతినగర, అశోక్‌నగర్, బాపూనగర్, చిక్కడపల్లి, సూర్యనగర్, ఫీవర్ ఆస్పత్రి, నల్లకుంటలోని రత్నానగర్, శివానందనగర్ ప్రాంతాల్లో నాలా ప్రహరీని పటిష్టంగా నిర్మించాలని చెప్తున్నారు. ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్, జాంభవినగర్, బాప్టిస్ట్ చర్చి, గణేష్‌నగర్ ప్రాంతాలలో ఉన్న వరదనీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



రాంనగర్ నాలా



పద్మాకాలనీలో ప్రవహిస్తున్న నాలా

అంబర్‌పేట నియోజకవర్గంలో

హుస్సేన్‌సాగర్ వరదనీటి నాలా పరీవాహక ప్రాంతాలైన గాంధీనగర్ లంక నుంచి చైతన్యనగర్, వెంకటేశ్వరనగర్, సంజీవయ్యనగర్, శాంతినగర్, కృష్ణనగర్, గంగానగర్ మీదుగా వరద నీరు ఇళ్లలోకి చేరుతుంది.

ఈ నాలా పరీవాహక ప్రజలెదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ భారీ వర్షాల నేపథ్యంలో వరద ముంపు ప్రాంతాల్లో శాశ్వతచర్యలు తీసుకోవాలని అంటున్నారు.

నాలాలన్నింటికీ ప్రహరీలు నిర్మిస్తాం



ముషీరాబాద్ నియోజకవర్గంలో వరదనీటి నాలాలకు ఇరువైపులా ప్రహరీలు ఉన్నాయి. ఇటీవల పద్మాకాలనీలో వర్షానికి కూలిన ప్రహరీని యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నాం. కాలువలో నీరు సాఫీగా వెళ్లేందుకు చెత్త, చెదారం పూడికతీత పనులు పూర్తి చేశారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కార చర్యలు చేపడతాం.

- రామానుజులరెడ్డి, ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ

భారీ వర్షాల నేపథ్యంలో
ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కార్పొరేటర్లు

కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లోని నాలాల పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్లు సూచిస్తున్నారు. వర్షం పడుతున్న సమయంలో అత్యవసర పనులపై మాత్రమే బయటకు వెళ్లాలని కోరుతున్నారు. హుస్సేన్‌సాగర్ పరీవాహక ప్రాంతమైన రత్నానగర్‌లో వరద నీరు ఇళ్లలోకి చేరింది. దీంతో కార్పొరేటర్ బస్తీలో ఆదివారం పర్యటించి పరిశీలించారు. బతుకమ్మకుంట వద్ద కూలిన కాలువ రిటర్నింగ్ వాల్ మట్టికప్పల తొలగింపును కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి పర్యవేక్షించారు. భారీ వర్షానికి చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం రథస్థలి షెడ్డు కూలిపోయింది. గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్, సబర్మతినగర్ బస్తీవాసులు వరదనీటితో ఇబ్బందులు పడుతుండడంతో వారిని టీజేఎస్ నేతలు పరామర్శించారు.

బస్తీవాసులకు టీజేఎస్ నేతల పరామర్శ

చిక్కడపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్, సబర్మతినగర్ బస్తీవాసులు వరదనీటితో ఇబ్బందులు పడుతుండడంతో ఆదివారం టీజేఎస్ నేతలు బస్తీలో పర్యటించి వారిని పరామర్శించారు. ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్ బస్తీలో పర్యటించారు. హుస్సేన్‌సాగర్ నుంచి వస్తున్న నాలాలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బస్తీవాసులకు ధైర్యం చెప్పారు. ప్రహరీ నిర్మాణం వల్ల బస్తీలోకి కాలువలోని వర్షపునీరు వచ్చే ప్రమాదం లేదన్నారు. చెత్తాచెదారం, వర్షాలు వచ్చినప్పుడు బస్తీవాసులు పడుతున్న ఇబ్బందుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

బతుకమ్మకుంట వద్ద కూలిపోయిన
కాలువ రిటర్నింగ్ వాల్

- బస్తీలో నిలిచిపోయిన వర్షపునీరు, ఇబ్బందులకు గురైన ప్రజలు
- పరిశీలించిన కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

నల్లకుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బాగ్అంబర్‌పేట డివిజన్‌లో శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం వల్ల బతుకమ్మకుంటను అనుకుని ఉన్న వర్షంనీరు పోయే కాలువ రిటర్నింగ్ వాల్ కూలి, నీటి ప్రవాహానికి అడ్డంగా నిలిచింది. దీంతో బస్తీలో వరదనీరు పోవడానికి చాలా సమయం పట్టింది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందిని రప్పించారు. వెంటనే ఈ బస్తీలో కూరుకుపోయిన మట్టిని తొలగించి, వాహనాలలో తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, ఇరిగేషన్, ట్రాన్స్‌కో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా వెంటనే పరిష్కరించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ర్షాల నేపథ్యంలో అన్ని కాలనీలు, బస్తీలు, రహదారులలో వరద నీరు సాఫీగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



మట్టికప్పల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మ

కూలిన రథస్థలి షెడ్డు

రాంనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి చిక్కడపల్లిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం రథస్థలి షెడ్డు ఆదివారం ఉదయం కూలిపోయింది. కూలిన శకలాలు పక్కనే పార్కు చేసిన పలు వాహనాలపై పడడంతో అవి ధ్వంసమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ ఈవో, చైర్మన్ కూలిన షెడ్డును పరిశీలించారు. ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులకు తెలుపగా వారు వచ్చి, శకలాలను తొలగిస్తామని చెప్పారు. కూలిన షెడ్డును టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధానకార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్ గౌడ్, టీడీపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ సందర్శించి మాట్లాడారు. నిర్వహణ లోపం వల్లనే ఈ రథస్థలి షెడ్డు కూలిందన్నారు. వెంటనే నూతనంగా నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.



కూలిన రథస్థలి షెడ్డు



నల్లకుంటలో హుస్సేన్‌సాగర్ నాలా ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

హుస్సేన్‌సాగర్ నాలా పరీవాహకంలో
సమస్యలు పరిష్కరిస్తాం
కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నల్లకుంట డివిజన్‌లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ యాకర అమృత సూచించారు. వర్షం పడుతున్న సమయంలో ఇతరత్ర వాటిపై కాకుండా అత్యవసర పనులపై మాత్రమే బయటకు వెళ్లాలని కోరారు. ముఖ్యంగా హుస్సేన్‌సాగర్ కాలువ ఉధృతంగా కొనసాగుతన్న నేపథ్యంలో డివిజన్ పరిధిలోని నాలా పరీవాహక ప్రాంతాల ప్రజలు శ్రద్ధగా ఉండాలని సూచించారు. ఈ విషయంలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డివిజన్‌లోని హుస్సేన్‌సాగర్ పరీవాహక ప్రాంతమైన రత్నానగర్ నాలా ప్రహరీ మట్టితో అస్తవ్యస్తంగా మారడంతో శనివారం అర్ధరాత్రి బస్తీలోని మ్యాన్‌హోల్స్‌లో వరదనీరు అధికం కావడంతో ఇళ్లలోకి చేరాయి. ఈ సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ ఆదివారం ఈ ప్రాంతంలో పాదయాత్ర చేసి, ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హుస్సేన్‌సాగర్ నాలా పరీవాహక ప్రాంతమైన రత్నానగర్, శివానందనగర్, గాంధీనగర్ లంక, చైతన్యనగర్ బస్తీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ విషయంపై ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమకు సమాచారం అందించాలని, దీంతో జీహెచ్‌ఎంసీ ఇతరశాఖల అధికారులు, సిబ్బంది సమస్య పరిష్కారానికి అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నల్లకుంట డివిజన్ ప్రధానకార్యదర్శి ఎంటీ.కిషోర్‌కుమార్, నాయకులు పాతకోటి మహేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



రత్నానగర్‌లో ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్న కార్పొరేటర్ యాకర అమృత

ఆర్‌ఎస్ఎస్ గురుస్థానం నాయకులకు సన్మానం



మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం తన నివాసంలో ఆర్‌ఎస్ఎస్‌లో గురుస్థానంలో ఉన్న నాయకులు డా.మనోహర్‌షిండే, బీరబోలు సురేందర్‌రెడ్డి, భాగయ్య, రామచంద్రయ్యను సన్మానించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే.అరుణ పాల్గొన్నారు. - రాంనగర్

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం : టీపీసీసీ

ముషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదలామ్ చేసేందుకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జీఎన్ కేశవ్ విమర్శించారు. సీసీ రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నేతల విధానాలను ఎండగడుతూ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీఎన్ కేశవ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై కుట్రలు చేయడం సిగ్గుచేటన్నారు.

ఇంజనీరింగ్ కాలేజ్ టాపర్‌కు అభినందన

చిక్కడపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజ్‌లో అన్ని సెమిస్టర్‌లలో టాపర్‌గా నిలిచిన విద్యార్థిని శ్రీప్రాయాదవ్‌ను కాలేజ్ యాజమాన్యం అభినందించారు. కేశవ్ మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో సీఎస్ఈ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ బ్యాచ్ నాలుగు సంవత్సరాల ఇంజనీరింగ్ విద్య ఎనిమిది సెమిస్టర్లలో ఫస్ట్ ర్యాంక్‌తోపాటు కాలేజ్ టాపర్‌గా శ్రీప్రాయాదవ్ నిలిచారు. ఆదివారం చిక్కడపల్లిలోని ఓ ప్రయివేట్ హోటల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీప్రాయాదవ్‌ను కేశవ్ మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజ్ వ్యవస్థాపకులు, చైర్మన్ నీల్ గోగ్టేతోపాటు ప్రిన్సిపాల్ పీవీఎన్ ప్రసాద్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆమె తల్లిదండ్రులు సూరజ్‌యాదవ్, సంజుయాదవ్ పాల్గొన్నారు.



శ్రీప్రాయాదవ్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

ఘనంగా బోనాలు

కవాడిగూడ/చిక్కడపల్లి/ముషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం బోనాల పండుగను ఆదివారం కవాడిగూడ చిత్రాలనగర్ నల్లపోచమ్మ దేవాలయంలో, గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని లక్ష్మీఉప్పలమ్మ దేవాలయంలో, భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్ బొంతల బస్తీలో కట్టమైసమ్మ, నల్లపోచమ్మ దేవాలయాలలో ఘనంగా నిర్వహించారు. చిత్రాలనగర్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, రాష్ట్ర యువజన నాయకులు ముఠా జైసింహ తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీఉప్పలమ్మ దేవాలయంలో జరిగిన వేడుకల్లో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. రంగానగర్‌లో జరిగిన వేడుకల్లో అమ్మవారికి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నర్సింగ్‌రావు అతిథులను శాలువాలతో సన్మానించారు.



నల్లపోచమ్మ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ, విశ్వనాథ్, యాదగిరి



చిత్రాల నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, టింకు, యాదగిరి తదితరులు



పూజల్లో వినయ్‌కుమార్, సంజీవరెడ్డి తదితరులు



బోనాల ఉత్సవాల్లో కాంగ్రెస్ నేత నర్సింగ్‌రావు, అశోక్ తదితరులు

బ్రాహ్మణ్స్ ఎక్స్‌పోకు మంచి స్పందన

బర్కత్‌పుర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ తుల్జాభవన్‌లో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణ్స్ ఎక్స్‌పో 2025కు మంచి స్పందన లభించింది. బ్రాహణ్స్ హెల్ప్ డస్క్ ఆధ్వర్యంలో ఈ ఎక్స్‌పోను నిర్వహించారు. నగరవ్యాప్తంగా వివిధ బ్రాహ్మణ మహిళలు ఎక్స్‌పోకు వచ్చి 32 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. చేతి వృత్తులతోపాటు వివిధ రకాల వస్తువులను ఈ స్టాల్స్ ద్వారా విక్రయించారు. బ్రాహ్మణ మహిళలకు ఆర్థిక సాధికారత అందించడానికి ఈ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు, నవీన్, గ్లోబల్ బ్రాహ్మిణ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరిప్రసాద్‌శర్మ, వివిధ బ్రాహ్మణ సంఘం నేతలు వేదాంతి పాండే, మంగపతిరావు, సరస్వతీప్రసాద్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



బ్రాహ్మణ్స్ ఎక్స్‌పోలో కొనుగోలు చేస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు

వృద్ధురాలిపై వీధికుక్క దాడి

- కుడికాలుపై తీవ్ర గాయం..
- ఫీవర్ ఆస్పత్రిలో చికిత్స, గాంధీకి తరలింపు

బర్కత్ పుర ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట్లో ఓ శుభకార్యానికి వచ్చిన వృద్ధురాలుపై వీధి కుక్క దాడిచేసింది. దీంతో ఆమె కుడికాలు పిక్కపై తీవ్ర గాయం అయింది. ఫీవర్ ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ జగదేవ్‌పూర్‌కు చెందిన డి.సిద్ధమ్మ(90) శనివారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలిసి యాప్రాల్‌లోని బాలాజీనగర్‌లోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చింది. ఆ వృద్ధురాలు చేతి కర్రను పట్టుకొని వీధిలోకి వచ్చింది. అక్కడ ఉన్న ఓ వీధి కుక్క వృద్ధురాలిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. కుడికాలి పిక్కపై కరవడంతో లోతైన గాయమై, తీవ్రరక్తస్రావం అయింది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో చేర్పించారు. కుక్కకాటు గాయాన్ని శుభ్రం చేసిన వైద్యులు ఇంజక్షన్‌తో పాటు, రిగ్ వ్యాక్సిన్ ఇచ్చారు. పిక్కపై మాంసం ముద్ద తెగిపోయి గాయం పెద్దగా ఉండడంతో ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు ఆ వృద్ధురాలని ఆదివారం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ ఎం.చిన్ననాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(35) బుద్వేల్ - శివరాంపల్లి రైల్వే స్టేషన్ నడుమ ఆరాంఘర్ బ్రిడ్జిపై శనివారం అర్ధరాత్రి 120 గంటల సమయంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు.



భోలక్‌పూర్ దేవుని తోట నుంచి ప్రారంభమైన తిరంగాయాత్రను ప్రారంభించిన బీజేపీ మహాకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, గడ్డం నవీన్

ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర
నవభారత నిర్మాణంలో ముందుండాలి : బీజేపీ

ముషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నవ భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వాములు కావాలని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. ఆదివారం బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లోని దేవునితోటలో గల భవానిశంకర ఆలయ ప్రాంగణం తిరంగాయాత్రను భరత్ గౌడ్ ప్రారంభించారు. ఈ ర్యాలీలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేవైఎం నగర అధ్యక్షుడు మద్దూరి శివాజీ, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- **బర్కత్‌పుర:** దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కాచిగూడలోని మోతీమార్కెట్ నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు ఆదివారం హర్‌ఘర్ తిరంగా యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడలో తిరంగాయాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ ఉమాదేవి తదితరులు